క్లుప్తంగా

పెండింగ్ డీఏ మంజూరు చేయరూ!



మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు: పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని, పన్నెండో పీఆర్సీ జ్యాప్యం కారణంగా తాత్కాలిక భృతిని ఇవ్వాలని స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రత్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షన్ పునరుద్ధరణ సరైనదేనని హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సిద్ధ మనోహర్, పీటర్ త్యాగరాజు, సుబ్రమణ్యం, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

డైట్ లెక్చరర్‌గా సురేష్‌బాబు




కుప్పం: మండలంలోని పెద్దగోపనపల్లె ఉన్నత పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు టి.సురేష్ బాబు ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్)లో సైకాలజీ బోధించేందుకు ఫారిన్ సర్వీసు కింద ఎంపికయ్యారు. ఇటీవల ట్యాబ్ బేస్డ్ పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరచి ఆయన ఎంపికయ్యారు. పలువురు టీచర్లు ఆయన్ను అభినందించారు.

సాంఘిక సంక్షేమశాఖ నిధుల్లో గోల్‌మాల్

పలమనేరు: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు సంబంధించిన నిధుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని సీమాంధ్ర విద్యార్థి నాయకుడు సురేష్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల కాలంలో వసతి గృహాలకు అందిన బిల్లులపై తాను ఆర్‌టీఐ ద్వారా సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కోరామని, కానీ జిల్లా అధికారులు నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలను ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనిపై పోరాటం చేస్తామన్నారు.

నంది వాహనంపై ఆదిశేషుడి విహారం



చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజైన బుధవారం రాత్రి ఉత్సవమూర్తులు మేళతాళాల నడుమ నంది వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్



సెల్వరాజ్‌ను అభినందిస్తున్న కౌన్సిలర్లు

కుప్పం: కుప్పంను ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని చైర్మన్ సెల్వరాజ్ అన్నారు. మున్సిపల్ ఉప ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ మద్దతుదారుడిగా చైర్మన్‌గా ఎన్నికై న అనంతరం బుధవారం బాధ్యతలు స్వీకరించి ఆయన మాట్లాడారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన సీఎం, స్థానిక ఎమ్మెల్సీ, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు వ్యవసాయ సాంకేతికతపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఏడీ శివకుమార్

పుంగనూరు: రైతులు ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలని ఏడీ శివకుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్లలో పలురకాల వ్యవసాయ విధానాలను తెలుసుకోవచ్చన్నారు. రైతులు డిజిటల్ పేమెంట్లు, వాతావరణం, సమాచారం, మార్కెటింగ్ సౌకర్యాలు కూడా యాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు ద్వారా పొందేందుకు వీలుందన్నారు. ప్రతి రైతు మరో 10 మంది రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి రాజేష్, మాస్టర్ ట్రైనర్ హరినాయక్, ఆర్‌ఎస్‌కె అధికారి నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లలో సిబ్బంది కొరత

- 18 పోస్టులు ఖాళీ
- ఇప్పుడు ఉన్నది ముగ్గురే..!
- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే తప్పని అవస్థలు
- గతంలో పీలేరులో మరమ్మతులు
- జిల్లాల ఏర్పాటుతో పీలేరు అన్నమయ్యలో విలీనం
- ఇప్పుడు మరమ్మతులకు పుంగనూరుకు పరుగు
- ఇబ్బంది పడుతున్న రైతన్నలు



సిబ్బంది కొరతతో నడుస్తున్న సబ్ స్టేషన్

రొంపిచెర్ల: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో 8 గ్రామ సచివాలయయలున్నాయి. వాటిలో సచివాలయానికి ఒక జూనియర్ లైన్‌మన్ వంతున గత వైఎస్సార్ సీపీ పాలనలో పోస్టులు మంజూరు చేశారు. అయితే గానుగచింత గ్రామ సచివాలయానికి మినహా ఎక్కడ లైన్‌మెన్లు లేరు. అలాగే మండలంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విద్యుత్ లో-ఓల్టేజి సమస్య నివారణకు మోటుమల్లెల, బండకిందపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె, జాండ్లవారిపల్లెకు సబ్ స్టేషన్లు మంజూరు చేయించారు. ఒక్కో సబ్‌స్టేషన్‌ను రూ.2కోట్లతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. అయితే గత ఏడాది ఎన్నికలు సమీపించడంతో చెంచెంరెడ్డిగారిపల్లె, జాండ్లవారిపల్లె సబ్ స్టేషన్లకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించలేకపోయారు. అలాగే గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె, బండకిందపల్లె, జాండ్లవారిపల్లె, రొంపిచెర్ల లైన్‌మన్ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. ఇక్కడ పని చేస్తున్న కొందరు ఉద్యోగోన్నతిపై, మరికొందరు సాధారణ బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో ఇప్పుడు మండలంలో కేవలం ముగ్గురు లైన్‌మన్లు మాత్రమే ఉన్నారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.18 పోస్టులనూ భర్తీ చేయకపోవడంతో ముగ్గురిపైనే పనిభారం పడి సతమతమవుతున్న పరిస్థితి. ఉన్న ముగ్గురు కూడా బదిలీలు జరిగితే ఇతర ప్రాంతాలకు వెళ్లి పోయే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పుంగనూరు నియోజకవర్గంలోని సోమల, సదుం మండలాల్లో కూడా ఇదే సమస్య ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకుని సిబ్బంది కొరత తీర్చి, విద్యుత్ సమస్యలపై త్వరిగతిన స్పందించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

జిల్లాల మార్పుతో పెరిగిన అగచాట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా మూడు జిల్లాలుగా మారడంతో ట్రాన్స్‌కో ఉద్యోగుల అగచాట్లు ఎక్కువ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను పీలేరులో చేసేవారు. అయితే ఇప్పుడు జిల్లాలు మారడంతో పీలేరు అన్నమయ్య జిల్లాలో కలిసింది. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు పుంగనూరు వెళ్లాల్సి వస్తోంది. రొంపిచెర్ల నుంచి పుంగనూరుకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకుని మరమ్మతులు చేసుకుని వచ్చేసరికి కనీసం నాలుగు రోజులు పడుతోంది. ఈలోపు పంటలకు నీరందకు ఎండిపోయే పరిస్థితి కలుగుతోంది. ఇది రైతన్నలకు నష్టం కలిగిస్తోంది. పీలేరులో అయితే ఉదయం తీసుకుని వెళ్లి సాయంత్రానికి మరమ్మతులు చేసుకునేవారు ఇప్పుడా అవకాశం లేకపోవడంతో రైతులు అగచాట్లు పడుతున్నారు.

నోటీస్ బోర్డు

- నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

సదుం: మండలంలోని బూరగమంద భూదేవీ, శ్రీదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. 8న ధ్వజారోహణం, 9న శేషవాహనం, 10న హంస వాహనం, 11న హనుమంత వాహనం, 12 కల్యాణోత్సవం, గరుడ వాహనం, 13న పుష్పపల్లకి, 14 న సింహవాహనం, 15న అశ్వవాహనం, 16న గజవాహనం, ధ్వజా అవరోహణం, 17న పుష్పయాగం, శయనోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

బురడగుంట గంగమ్మకు పూజలు

పుంగనూరు: మండలంలో కుమ్మరగుంటలోని శ్రీబురడగుంట గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు, నెయ్యిదీపాలు, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు.

పలమనేరులో తిరుపతి గంగమ్మకు..

పలమనేరు: తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఏడోరోజైన మంగళవారం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన రజక, కరుణీకర్ కులస్తుల ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

- నిధుల వివరాలు ఇవ్వని ఎంపీడీఓ
- నిరసన వ్యక్తం చేసిన సభ్యులు



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న మండల పరిషత్ సభ్యులు

పెద్దపంజాణి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ప్రజా ప్రతినిధులు బహిష్కరించారు. వివరాలు.. 90 రోజుల క్రితం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఆ సమావేశంలో సభ్యులు మండల జనరల్ ఫండ్, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ70 లక్షలకు సంబంధించి వివరించారు వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓ బాలాజీని కోరారు. అయితే ఇంతవరకూ ఆయన వివరాలు ఇవ్వకపోవడంతో ఏప్రిల్ 20న పలమనేరులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు నిధుల వివరాలు, వాటి దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. సభ్యుల ఆమోదం లేకనే ఫోర్జరీ సంతకాలు చేశారని, ఇప్పటి వరకూ వాటి వివరాలు ఇవ్వలేదని నిరసిస్తూ బుధవారం మండల సమావేశాన్ని బహిష్కరించామని వైస్ ఎంపీపీ జీడీ బాబు తెలిపారు. జెడ్పీటీసీ సుష్మా మాట్లాడుతూ, గత ఏడాది అక్టోబర్‌లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తాగునీటి కోసం మండలానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తే ఎంపీడీఓ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇంతవరకూ గ్రౌండింగ్ చేయలేదని ఆరోపించారు. పూర్తి సమాచారం ఇచ్చే వరకూ సమావేశాలకు హాజరయ్యేది లేదని ఎంపీటీసీ సభ్యులు తేల్చి చెప్పారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి శంకరప్ప, పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

మండల పరిషత్‌లో 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. బుధవారం సభ్యులు బహిష్కరించడం, కోరం లేకపోవడంతో ఎంపీడీఓ బాలాజి సమావేశాన్ని గురువారానికి వాయిదా వేశారు.

ఎండల్లో వాన హోయ్..



గంగవరం: ఎండలో వర్షం కురుస్తున్న దృశ్యం

గంగవరం: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ భానుడు తన ప్రతాపం చూపాడు. అంతలోనే హఠాత్తుగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం గంటపాటు కురిసింది. ఓ వైపు ఎండకాస్తున్నా వర్షం కురవడాన్ని ప్రజలు ఎంజాయ్ చేశారు.

సదుం: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది.వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. వర్షం కారణంగా సదుంలో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

వర్షంలోనే ముత్యపు పందిరి వాహనంపై విహారం



ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



పంచలోహ విగ్రహాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దాతలు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ కోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ఉదయం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ సింహ వాహనంపై విహరించారు. తొలుత ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, చందన పుష్ప తాంబూలాలతో అభిషేకించి శ్రీవారి నైవేద్య ఘంటానాదం అనంతరం నైవేద్యం సమర్పించారు. సింహ వాహన సేవ అనంతరం ఉభయ దేవేరులు సహా స్వామివారి ఉత్సవ మూర్తులు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. ఇక్కడ ఉత్సవమూర్తులకు పలు రకాల సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా ఉయ్యాలసేవలో సేదదీరారు.

వరుణుడు వచ్చె..!..

రాత్రి శ్రీనివాసుడు శ్రీకృష్ణుడిగా బకాసురవధ అవతారంలో రుక్మిణీ, సత్యభామతో కలిసి ముత్యపు పందిరి వాహనంలో కొలువుదీరి మాడ వీధుల్లో విహరిస్తుండగా, వరుణుడు తన జల్లులతో అభిషేకించాడు. వర్షపు జల్లుల నడుమ ఊరేగింపు సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్‌గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, కంకణ భట్టార్ ఏకే. నరసింహాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

విశ్వక్సేనుల పంచలోహ విగ్రహం సమర్పణ

గంగవరం: శ్రీవారి సర్వసేనాధిపతి విశ్వక్సేనుల పంచలోహ విగ్రహాన్ని కీలపట్ల గ్రామస్తులు తోట లక్ష్మణమూర్తి దంపతులు కీలపట్ల శ్రీకోనేటిరాయ స్వామి ఆలయానికి బుధవారం సమర్పించారు. రూ. 63వేల విలువ చేసే విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ ఈఓ లక్ష్మీ ప్రసన్న, కంకణ బట్టార్ ఏకే.. నరసింహాచార్యులు, ఆలయ అధికారులకు అందజేశారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

పుంగనూరు: విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం క్షత్రియ సంఘం అధ్యక్షుడు భక్తవత్సలరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం అసామాన్యమని భక్తవత్సలరాజు కీర్తించారు. ఆయన్ను క్షత్రియులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘ నాయకులు రెడ్డెప్పరాజు, సుబ్రమణ్యంరాజు, లక్ష్మణ్‌రాజు, భాస్కర్‌రాజు, సతీష్‌రాజు, జ్యోతిరాజు, జగదీష్‌రాజు, మంజురాజు, సుదర్శన్‌రాజు, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



అమ్మవారికి కల్యాణం చేస్తున్న దృశ్యం

గుడిపాల : మండలంలోని వసంతాపురంలో 18 రోజుల పాటు నిర్వహించే మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ ధర్మరాజుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భాగవతార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించిన హరికథాగానం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..



జంగాలపల్లెలో చెత్త డబ్బాలను పంపిణీ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కృష్ణప్ప

చౌడేపల్లె: ఉరుకులు పరుగుల నడుమ ప్లాస్టిక్ డబ్బాలు(చెత్తసేకరణ డస్ట్‌బిన్నులు) లను గ్రీన్ అంబాసిడర్ల ద్వారా పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండలానికి చేరిన చెత్తబుట్టలను ఇప్పటివరకూ పూర్తి స్థాయిలో పంపిణీ చేయడకంపై బుధవారం 'మూలనపడేశారు బాబూ..!' శీర్షికతో ప్రచురించిన కథనంపై డిప్యూటీ ఎంపీడీఓ కృష్ణవేణి స్పందించారు. సచివాలయాల్లో, స్టాక్ రూముల్లో నిల్వ ఉన్న చెత్తడబ్బాలను కృష్ణవేణి ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లతో పంపిణీకి ఉపక్రమించారు. మరో రెండు రోజుల్లోపు అన్ని పంచాయతీల్లోని ప్రతి ఇంటికీ చెత్తసేకరణ డబ్బాలు పంపిణీ చేస్తామని డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు.

పంటలపై మళ్లీ ఏనుగుల దాడి

- హడలిపోతున్న రైతులు
- నాడు ఒంటరి ఏనుగు..ఇప్పుడు ఏనుగుల గుంపు



ఏనుగుల దాడి చేసి విరిచేసిన మామిడిచెట్లు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీలో బుధవారం తెల్లవారు జామున దాదాపు 13 ఏనుగుల గుంపు మామిడి, టమాట, వరి పంటలపై పడి నష్టం కలిగించాయి. పాకాల మండలం వల్లివేడు అటవీ ప్రాంతం నుంచి ఈ గుంపు పాళెం పంచాయతీలోకి ప్రవేశించాయి. అటవీ అధికారులు వీటిని దారి మళ్లించడానికి ఎంత ప్రయత్నించినా వీలుకాలేదు. కోటపల్లెకు చెందిన ఈశ్వరమ్మ, నాగరత్నమ్మకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. ఏనుగుల గుంపు మూలాన భారీగా పంటలను నష్టపోయామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఘనంగా గురుపూజ మహోత్సవం



పూజా కార్యక్రమాల్లో భక్తులు

వి.కోట : మండలంలోని దాసార్లపల్లెలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి ఆరాధన, గురుపూజ మహోత్సవ కార్యక్రమాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గణపతిపూజ, నవగ్రహ పూజ, వాస్తుపూజ, వివిధ హోమాలతోపాటు బ్రహ్మంగారి చూర్ణిక హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించి రంగురంగుల పూలతో అలంకరించారు. సాయంత్రం గురుపూజ, రుగ్వేద పారాయణం నిర్వహించారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.

యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా



కుప్పం: కుప్పంలో యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా సాగుతోంది. పర్మిట్లు తీసుకుని క్వారీల్లో గ్రానైట్ దిమ్మెలను రవాణా చేయాలని పలుసార్లు అధికారులు హెచ్చరించినా ఫలితం లేకపోయింది. కూటమి నేతలు ఇష్టానుసారంగా భారీ వాహనాల్లో గ్రానైట్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు. బుధవారం కొత్తయిండ్లు, నూలుకుంట, గరికచీనేపల్లె, మల్లానూరు మీదుగా భారీ వాహనంలో తమిళనాడుకు గ్రానైట్‌ను తరలించారు. ఇంతజరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

భక్తిప్రపత్తులతో వాసవీమాత జయంతి



పలమనేరు: ఆలయంలో చేస్తున్న ప్రత్యేక హోమాలు



బైరెడ్డిపల్లె: వేలంలో చీరను అందజేస్తున్న వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు

పలమనేరు: వాసవీమాత జయంతి పురస్కరించుకుని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష్మీకుంకుమార్చన, లలితా మహాహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



వీ.కోట: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



కుప్పం: ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి, పుష్పపల్లకిపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలాగే, అమ్మవారి చీరను వేలంలో బైరెడ్డిపల్లెకు చెందిన నాగేంద్ర దంపతులు రూ.14 వేలకు దక్కించుకున్నారు. వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవీ మాతకు క్షీరాభిషేకం

వి.కోట: పట్టణంలోని శ్రీ వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్యులు ఉదయం అమ్మవారికి అభిషేకం, గంగపూజ, కలశపూజ నిర్వహించారు. అనంతరం మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గణపతి, చండీహోమాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.. సాయంత్రం అమ్మవారిని విశేషంగా అలకరించి ఊరేగించారు. సభ్యులు ధవనం భక్త శ్రీనివాసులు, సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, మధు, కష్ణమూర్తి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం: స్థానిక పాతపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. నూతన ఆలయంలో పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో వాసవి జయంతిని బుధవారం ఆర్య వైశ్య సంఘం ఘనంగా నిర్వహించింది. బజారు వీధిలోని అమ్మవారి ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తదుపరి అమ్మవారిని పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.